క్లుప్తంగా

ఫర్టిలైజర్ షాపుల తనిఖీ



తనిఖీ చేస్తున్న సీఐ, ఏవో తదితరులు

జమ్మికుంట: పట్టణంలోని ఫర్టిలైజర్ షాపులను టౌన్ సీఐ ఎస్ రామకృష్ణ, ఏవో ఖాదర్ హుస్సేన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలన్నారు. ఎంఆర్‌పీ, స్టాక్ రిజిస్టర్, బోర్డులు ఏర్పాటు చేయాలని, బిల్లుపై రైతు సంతకం తీసుకోవాలన్నారు. అన్ని వివరాలు రికార్డు చేసుకోవాలన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్ సురేఖను సన్మానిస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు

శంకరపట్నం: శంకరపట్నం తహసీల్దార్ సురేఖను మంగళవారం అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు అంతడ్పుల సతీశ్ సన్మానించారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించగా మర్యాద పూర్వకంగా కలిశామని అంబేద్కర్ సంఘం నాయకులు దాసారపు భద్రయ్య, కనుకం శంకర్, బొజ్జ రవి, క్యాదాసి బాస్కర్, బొల్లారం రాజయ్య తెలిపారు.

ట్రైసైకిల్ అందజేత



జమ్మికుంట: మున్సిపల్ పరిధి రెండో వార్డు ధర్మారం గ్రామానికి చెందిన దివ్యాంగుడు శనిగరపు రాజయ్యకు మాజీ కౌన్సిలర్ మారపల్లి భిక్షపతి సహకారంతో ఆర్యవైశ్య మిత్రులు మంగళవారం ట్రైసైకిల్ అందజేశారు. మారపల్లి భిక్షపతి మాట్లాడుతూ గ్రామంలో దాతల సహాయంతో ప్రజల సమస్యలకు పరిష్కారానికి కోసం కృషి చేస్తున్నామని, దాతలు ముందుకు వచ్చి చేయూత అందించడం పట్ల ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయ పునర్నిర్మాణానికి సహకరించాలి



ఆలయం వద్ద పూజలు చేస్తున్న రజకులు

చిగురుమామిడి: మండలంలోని నవాబుపేట గ్రామంలో ఎనభై ఏళ్ల క్రితం నిర్మించిన మడేలేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి సహకరించాలని రజకులు కోరారు. మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం శిథిలావస్థలో ఉందని, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ తమవంతు సహకారాలు అందించాలని, మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించాలని కోరారు. కార్యక్రమంలో వరుకోల రవీందర్, సారయ్య, కనుకయ్య, వెంకటయ్య, సమ్మయ్య, పర్శయ్య, రవి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



డిపాజిట్ పత్రాల అందజేత

గంగాధర: తమతో కలిసి చదువుకున్న స్నేహితురాలు రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా ఆమె కుటుంబానికి తోటి మిత్రులు అండగా నిలిచారు. మండలంలోని గర్శకుర్తికి చెందిన అనురాధ రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. 2001–02 పదో తరగతి మిత్రులు అనురాధ కొడుకులు ఆడెపు విశాల్, రాహుల్ పేరు మీద రూ.నలభై వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి మంగళవారం కుటుంబ సభ్యులకు అందజేశారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

సైదాపూర్: వెన్కెపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. హుజూరాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యతిపతి అరుణ్‌కుమార్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గ్రామస్తులకు చట్టాలు, న్యాయ వ్యవస్థపై అవగాహన కల్పించారు. న్యాయవాదులు అందె వెంకటేశ్వర్‌రావు, కుమారస్వామి, భానుకిరణ్, హరిహరన్, సంతోష్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో డ్రైవింగ్

- మూడు వాహనాలను ఢీకొట్టిన కారు
- నలుగురికి గాయాలు..



స్తంభాన్ని ఢీకొని ఆగిన ఆటో

తిమ్మాపూర్: మద్యం మత్తులో కారు నడిపిన డ్రైవర్ తిమ్మాపూర్ క్రాస్ రోడ్డు వద్ద మూడు వాహనాలు ఢీకొట్టాడు. ఈ ఘటనలో నలుగురు గాయపడ్డారు. హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వస్తున్న బొలెరో జీపును రోడ్డు దాటుతున్న కారు ఢీకొట్టడంతో జీపు పక్కన వెళ్తున్న ఆటోను ఢీకొట్టింది. ఆటో ఎదురుగా ఉన్న కరెంటు స్తంభాన్ని ఢీకొని ఆగిపోయింది. ప్రమాదంలో ఆటో డ్రైవర్ శ్రీనివాస్‌తోపాటు ప్రయాణికులు అరుణ, గాయత్రి, ఉమకు స్వల్ప గాయాలయ్యాయి.

స్థానికుల ఆగ్రహం..

డ్రైవర్ మద్యం మత్తులో నిర్లక్ష్యంగా వాహనం నడిపి ప్రమాదానికి కారణమయ్యాడు. ప్రమాదం తర్వాత స్థానికులు కారు డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి గాయపడిన నలుగురిని 108లో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అయితే కారు డ్రైవర్ పోలీసుల ఎదుటే పరార్ కావడంతో స్థానికులు పోలీసుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సాధారణ సమయాల్లో డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేసే పోలీసులు ప్రమాదానికి కారణమైన డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నా పట్టుకోకుండా వదిలేయడం నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు. ఎట్టకేలకు కానిస్టేబుల్ నరేశ్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



పోలీసులతో స్థానికుల వాగ్వాదం

పదవికాలం పొడిగింపు

- బాధ్యతలు చేపట్టనున్న ఏడు సహకార సంఘ పాలకవర్గాలు
- పీఏసీ చైర్మన్లుగా అధ్యక్షులు

మానకొండూర్: సహకార సంఘాల పాలకవర్గ సభ్యుల పదవీ కాలం ఈ ఏడాది ఫిబ్రవరితోనే గడువు ముగిసింది. పదవీకాలం గడువు మరో ఆరు నెలలు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. జిల్లాలోని ఏడు సహకార సంఘాలు మినహా మిగితాచోట్ల పర్సన్ ఇన్‌చార్జీలుగా పాత పాలకవర్గ అధ్యక్షులు(పర్సన్ ఇన్‌చార్జీగా) కొనసాగుతున్నారు. కారణాలు ఏవైనా మండలంలోని గట్టుదుద్దెనపల్లి, ఊటూరు, శంకరపట్నం మండలం మెట్‌పల్లి, గద్దపాక, చొప్పదండి మండలం ఆర్నకొండ, చొప్పదండి, తిమ్మాపూర్ మండలం పొరండ్ల సొసైటీల పాలకవర్గాలకు మాత్రం సహకార సంఘాలకు ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆర్డర్లు అందలేదు. దీంతో పాలకవర్గాలు మిన్నకుండి పోయాయి. సహకార అధికారులనే ఏడుచోట్ల పర్సన్ ఇన్‌చార్జీలుగా నియమించారు. అయితే ఈ ఏడు సహకార సంఘాల్లోని కొంతమంది అధ్యక్షులు ప్రభుత్వం పొడిగించిన గడువు మాకు ఎందుకు వర్తించదని కోర్టును ఆశ్రయించినట్లు తెలిసింది. ప్రభుత్వం పొడగించిన గడువు అందరికి వర్తించాలని కోర్టు ఆదేశించినట్లు తెలిసింది. అయినా పాత పాలకవర్గానికి ఎలాంటి ఉత్తర్వులు సహకార సంఘం అధికారులు అందించకపోవడంతో మరో మారు పాతపాలకవర్గ అధ్యక్షులు పలువురు కోర్టు మెట్లెక్కినట్లు తెలుస్తోంది. ఎట్టకేలకు సహకార అధికారి ఏడు సహకార సంఘాల అధ్యక్షులను పీఏసీ చైర్మన్లుగా, మిగతా సభ్యులు పీఏసీ కమిటీ సభ్యులుగా కొనసాగేలా ఉత్తర్వులు జారీ అయ్యాయి.

జవహర్‌లాల్ నెహ్రూ సేవలు చిరస్మరణీయం



నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇల్లందకుంట: దేశానికి దివంగత ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చేసిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కుమార్ అన్నారు. నెహ్రూ వర్ధంతి సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు నివాళి అర్పించారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో నెహ్రూ కీలక భూమిక పోషించారని గుర్తు చేశారు. విద్యార్థులు, యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకొనిముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పుల శ్రీనివాస్‌రెడ్డి, కనుమల్ల సంపత్, కనుమల్ల రామకృష్ణ, ఎక్కటి సంజీవరెడ్డి, మహేష్, చిరంజీవి, రాజేందర్, గోపాల్ రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు మీసరాజయ్య, తిరుపతిరెడ్డి, సాయిరామ్, బండి మల్లయ్య, రమష్, కిషన్, బీరయ్య, రాము, మానస, దంసాని తిరుపతి, ఓదెలు, రవీందర్, పుట్ట రాజు, తోట రాజు, కట్ల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

యోగా తరగతులు ప్రారంభం

గంగాధర: మండలంలోని మధురానగర్ గ్రామ పంచాయతీలో మంగళవారం గంగాధర ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆధ్వర్యంలో యోగా శిక్షణ తరగతులు ప్రారంభించారు. అంతర్జాతీయ యోగా దశాబ్ది ఉత్సవాల సందర్భంగా 25 రోజుల పాటు తరగతులు నిర్వహించనున్నామని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని యోగా ట్రైనర్ సరస్వతి సూచించారు. కార్యక్రమంలో హోమియో వైద్యాధికారి శ్రీవాణి, ఫార్మసిస్ట్ సురేష్, కారోబార్ భూపతి, ఆశా వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వానాకాలం సాగుపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

చొప్పదండి: వర్షాకాలంలో సాగు చేసే పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడి సాధించాలని జిల్లా వ్యవసాయాధికారి జె.భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని ఆర్నకొండ రైతు వేదికలో మంగళవారం రైతులకు పంటల యాజమాన్య పద్ధతులు, ఎరువుల వినియోగం, ఆయిల్‌పాం సాగు విధానం, డ్రిప్ ద్వారా నీటి ఆదా, పచ్చిరొట్ట లాభాలు తదితర అంశాలపై వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు అవగామన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొత్తూరి మహేశ్, జిల్లా ఉద్యాన అధికారి శ్రీనివాస్‌రావు, చింతకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు ఉషారాణి, విజయ భాస్కర్, అధికారులు ప్రభావతి, రామకృష్ణ, విష్ణువర్ధన్, ఏవో వంశీకృష్ణ, సీహెచ్ రోహిత్, ఏఈవో రాజశేఖర్ పాల్గొన్నారు.

జీలుగ విత్తనాలు పంపిణీ

గన్నేరువరం: మండలంలోని గుండ్లపల్లి, హన్మాజీపల్లె, సాంబయ్యపల్లె, గన్నేరువరం డీసీఎంఎస్ కేంద్రాల్లో మంగళవారం జీలుగ విత్తనాలను మండల వ్యవసాయశాఖ అధికారి కిరణ్మయి పంపిణీ చేశారు. యాభై శాతం సబ్సిడీపై విత్తనాలను అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి గల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బద్దం తిరుపతిరెడ్డి, కటకం తిరుపతి, ఏఈవో ప్రశాంత్, అటికం తిరుపతిగౌడ్, భూమాడి మోహన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఇద్దరి మృతి



కుమారస్వామి (ఫైల్)



శ్రీనివాస్(ఫైల్)

జమ్మికుంట: మున్సిపల్ రెగ్యులర్ ఉద్యోగి పుల్లల కుమారస్వామి (46) (బిల్లు కలెక్టర్) మంగళవారం హఠాన్మరణం చెందారు. గ్రామస్తులు, మున్సిపల్ ఉద్యోగులు తెలిపిన వివరాలు...రోజువారి విధుల్లో భాగంగా మధ్యాహ్నం భోజనానికి అబాది జమ్మికుంటలోని ఇంటికి వెళ్లి ఒక్కసారిగా కుప్పకూలాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే గుండెపోటుతో మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య సుమలత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమారస్వామి మృతి పట్ల కమిషనర్ ఎండీ అయాజ్, ఉద్యోగులు, మాజీ కౌన్సిలర్లు దయ్యాల శ్రీనివాస్, వెంకటేశ్ సంతాపం తెలిపారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

హుజూరాబాద్: మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ అల్లి శ్రీనివాసు(60) మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఛాతిలో నొప్పి రావడంతో ఆసుపత్రికి తీసుకెళ్లే లోపే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

చొప్పదండి: మండలంలోని సాంబయ్యపల్లి మాజీ సర్పంచ్ ప్రొఫెసర్ కొత్తపల్లి రామకృష్ణ అనారోగ్యంతో మంగళవారం హైదరాబాద్‌లోని స్వగృహంలో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా ఉద్యోగ విరమణ అనంతరం 2019లో నూతనంగా గ్రామ పంచాయతీగా ఆవిర్భవించిన సాంబయ్యపల్లి సర్పంచ్‌గా పోటీ చేసి గెలుపొందారు. బుధవారం హైదరాబాద్‌లోనే అంత్యక్రియలు నిర్వహించనున్నారని, ఆయన మృతిపట్ల గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు.

జీపీ కార్యదర్శుల పరేషాన్

- విలీన కార్యదర్శులకు పోస్టింగ్
- రిలీవ్ చేయని కార్పొరేషన్ ఆఫీసర్లు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ కార్పొరేషన్‌లో విలీనమైన గ్రామాల పంచాయతీ కార్యదర్శులు త్రిశంకు స్వర్గంలో కొట్టుమిట్టాడుతున్నారు. అటు పంచాయతీరాజ్‌శాఖ పరిధిలో కాకుండా, ఇటు మున్సిపల్ శాఖ పరిధిలోకి రాకుండా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల విలీన గ్రామాలకు చెందిన ఐదుగురు పంచాయతీ కార్యదర్శులను డీపీవో జగదీశ్వర్ బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయగా కార్పొరేషన్ అధికారులు రిలీవ్ చేయకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. మూడు నెలల క్రితం కార్పొరేషన్‌లో శివారు గ్రామాలైన బొమ్మకల్, దుర్శేడ్, గోపాల్‌పూర్, చింతకుంట, మల్కాపూర్ గ్రామాలను ప్రభుత్వం విలీనం చేసింది. ఈ క్రమంలో పంచాయతీ సిబ్బందితోపాటు కార్యదర్శులను సైతం కార్పొరేషన్ పరిధిలోకి తీసుకోవడంతో విధులను నిర్వహిస్తున్నారు. అయితే కార్పొరేషన్ ఉద్యోగులుగా పంచాయతీ కార్యదర్శులను తీసుకుంటున్నట్లుగా ప్రభుత్వం నుంచి పంచాయతీరాజ్‌శాఖకు ఎలాంటి ఉత్తర్వులు జారీ కాలేదు. దీంతో జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్ ఈనెల 7వ తేదీన చింతకుంట కార్యదర్శి టి.మల్లేశంను శంకరపట్నం మండలం కల్వల పంచాయతీ కార్యదర్శిగా, మల్కాపూర్ కార్యదర్శి జి.శ్రీనివాస్‌ను గద్దపాక కార్యదర్శిగా, బొమ్మకల్ కార్యదర్శి ఎండీ హిదైతుల్లాను వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి కార్యదర్శిగా, గోపాల్‌పూర్ కార్యదర్శి విజయలక్ష్మిని కొండపాక కార్యదర్శిగా, దుర్శేడ్ కార్యదర్శి పద్మను మానకొండూరు మండలం ఈదులగట్టెపల్లి కార్యదర్శిగా బదిలీ చేశారు. ఆయా కార్యదర్శులను మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్ వెంటనే రిలీవ్ చేసినట్లయితే ఎంపీడీవోకు రిపోర్టు చేస్తారని సూచించారు. అయితే, పంచాయతీ కార్యదర్శుల బదిలీ సమాచారాన్ని సీడీఎంఏకు పంపించగా అక్కడి నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాకపోవడంతో కార్యదర్శులను రిలీవ్ చేయడంలో జాప్యం అవుతోందని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం త్వరగా ఏదో ఒక నిర్ణయం తీసుకుని ఉత్తర్వులు జారీచేయాలని పంచాయతీ కార్యదర్శులు కోరుతున్నారు.

ముందస్తు అరెస్టు

చొప్పదండి: హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించ తలపెట్టిన ఆటో ఆకలి కేక మహాసభకు బయలు దేరిన భారత్ మినీడోర్ ఆటో యూనియన్ ఆటో డ్రైవర్లను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.

శంకరపట్నం: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆటోడ్రైవర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలనే డిమాండ్‌తో హైదరాబాద్ వెళ్తున్నారనే సమాచారంతో మాజీ సర్పంచ్‌లను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

చిగురుమామిడి: మండలంలోని మాజీ సర్పంచులు ప్రజాభవన్‌కు తరలివెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. ప్రొబేషనరీ ఎస్సై జగదీశ్ మాజీ సర్పంచులు బెజ్జంకి లక్ష్మణ్, సన్నీల్ల వెంకటేశం, గోలి బాపురెడ్డి, నాగెల్లి లక్ష్మారెడ్డి, జక్కుల రవీందర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ప్రజాభవన్‌లో నిర్వహించే ప్రజావాణిలో పెండింగ్ బిల్లులపై వినతిపత్రం ఇచ్చేందుకు బయలుదేరగా పోలీసులు అడ్డుకోవడం సరికాదని మాజీ సర్పంచులు అన్నారు.

హుజూరాబాద్: అభివృద్ధి పనుల బిల్లులు చెల్లించాలని మాజీ సర్పంచులు ప్రభుత్వాన్ని కోరితే బిల్లులు చెల్లించకుండా వేధింపులకు పాల్పడుతుందని రంగాపూర్ మాజీ సర్పంచ్ బింగి కరుణాకర్ అన్నారు. మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. చేసిన పనులకు బిల్లులు క్లీయర్ చేయక ముందే చేసినట్టు ప్రకటనలు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు.

గన్నేరువరం: మండలంలోని మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వం కాలయాపన చేయకుండా వెంటనే బకాయిలను చెల్లించాలని మాజీ సర్పంచులు తీగల మోహన్‌రెడ్డి, గంప మల్లీశ్వరీ, మల్లయ్య, చెన్నాల నగేష్‌లు కోరారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వికాస తరంగిణి శాఖ, ఆలయ కమిటీ సభ్యులు

జమ్మికుంట: పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం ఆవరణలో వికాస తరంగిణి సౌజన్యంతో 31న ఉదయం స్వర్ణామృత ప్రాసన పోస్టర్‌ను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఆవిష్కరించారు. స్వర్ణామృత ప్రాసన డోస్‌లను ప్రతినెలా పుష్యమి నక్షత్రం రోజు ఉచితంగా 6 నెలల పిల్లల నుంచి 16 ఏళ్ల పిల్లలకు పంపిణీ చేయనున్నామని, చిన్నపిల్లల తల్లిదండ్రులు అవకాశాన్ని సద్వి నియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9989509999, 7893426429 సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో అర్చకులు డింగరి హరికృష్ణమాచార్యులు, అంతం రాజిరెడ్డి, ముక్క జితేంద్రగుప్తా, శీలం శ్రీనివాస్, ముస్కె వీర్రాజు, పుల్లూరి ప్రభాకర్‌రావు, తిరునహరి సురేశ్‌బాబు, నాగపూరి విజయ్, రామిని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మానసాదేవి ఆలయంలో నిలిచిన నీరు





గన్నేరువరం: మండలంలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి ఖాసీంపేట శ్రీమానసాదేవి ఆలయంలోకి భారీగా వర్షపు నీరు చేరింది. ఆలయంలోని పైపుల ద్వారా నీరు బయట వెళ్లలేని పరిస్థితిల్లో నీరు ఆలయంలోనే నిలిచిందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



హుజూరాబాద్: మండలంలోని కనుకులగిద్దె గ్రామం నుంచి ధర్మరాజుపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డుపై అనేక మూలమలుపులు ఉన్నాయి. ఈ మూలమలుపుల వద్ద రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కానరాక అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, సంబంధిత అధికార యంత్రాంగం స్పందించి పిచ్చి మొక్కలను తొలగింపజేయాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
టి. సునీత, ఎంపీడీవో, హుజూరాబాద్ సెల్ నం : 99899 30709

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

కుంట కబ్జాపై విచారణ



విచారణ జరుపుతున్న అధికారులు

హుజూరాబాద్: పట్టణంలోని గంగోని కుంట కబ్జాపై మంగళవారం ఇరిగేషన్ అధికారులు విచారణ జరిపారు. మండలానికి చెందిన ముదిరాజ్ మహాసభ నాయకుడు కొలిపాక సమ్మయ్య కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా అధికారులు విచారణ చేపట్టారు. 12.06 ఎకరాల భూమికి కనీసం ఆరెకరాలు కూడా లేదని అధికారుల విచారణలో వెల్లడైంది. నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నామని తెలిపారు. విచారణలో ఇరిగేషన్ ఏఈలు సునీత, ప్రీతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ సందీప్, లష్కర్లు భాస్కర్, మొగిలి, రవి ఉన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ట్రినిటి విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న దాసరి మనోహర్‌రెడ్డి

కరీంనగర్: జేఈఈ మెయిన్స్–2025 ఫలితాల్లో ట్రినిటి జూనియర్ కళాశాల విద్యార్థుల అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని కళాశాల కరస్పాండెంట్ దాసరి మనోహర్‌రెడ్డి తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను మంగళవారం కళాశాల ఆవరణలో అభినందించారు. బీ–ప్లానింగ్ విభాగంలో బి.హితేష్ (152), డి.మహేష్(227), బి.రేణుక (393), ఏ.శరణ్యనందిని (737), ఎం.నిఖిత్‌నాయక్ (1031), వి.లత (1092), జి.అజయ్ (1115), ఆర్.ఐశ్వర్య (1272), ఎం.అంజనశ్రీ (1388), బీ–ఆర్క్ విభాగంలో బి.హితేష్(718), డి.మహేష్ (756), బి.రేణుక(1208), ఆర్.ఐశ్వర్య (1877), ఎ.శరణ్యనందిని (1855) ర్యాంకులు సాధించారని వెల్లడించారు. నిర్దేశించిన లక్ష్యాలు చేరడానికి ప్రణాళిక, నిరంతర శ్రమ అవసరమని, విద్యార్థులు భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

'ఎంపీ బండి సంజయ్‌ను విమర్శిస్తే సహించం'

జమ్మికుంట: యువజన కాంగ్రెస్ నాయకులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని విమర్శిస్తే సహించమని విద్యార్థి సంఘం నాయకుడు గట్టు సాయిరాం అన్నారు. మంగళవారం పట్టణంలో మాట్లాడారు. జమ్మికుంట రైల్వే స్టేషన్‌ను అమృత్ పథకంలో చేర్చనున్నట్లు ఇటీవల ప్రకటించారని, ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేలా చర్యలు చేపట్టారని, కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి యువజన నాయకులు వినతి పత్రం అందజేయాలని ఎద్దేవా చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు కొత్త గణపతిరెడ్డి, దేవులపల్లి నవీన్, వంశీ, రమేష్, గణేష్, యశ్వంత్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మంచి వైద్యసేవలు అందించాలి



జమ్మికుంట: హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డా.నల్ల నారాయణరెడ్డి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కరీంనగర్ జిల్లా మేదరి సంఘం అధ్యక్షుడు మధిర రవీందర్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని పేదలు, రోగులకు మంచి వైద్య సేవలు అందించాలని కోరామన్నారు. కార్యక్రమంలో మేదరి సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

శని జయంతి పూజలు

కరీంనగర్‌కల్చరల్: వైశాఖ అమావాస్య సందర్భంగా మంగళవారం భక్తులు పూజలు నిర్వహించారు. శని జయంతి కావడంతో నగరంలోని నవగ్రహాలున్న ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శనికి తైలాభిషేకాలు, అర్చనలు, దానాలు చేశారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి

కరీంనగర్‌టౌన్: పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఎన్నం ప్రకాశ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లింపులు నిలిపివేసి, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని కోరారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, వృత్తి విద్యా కోర్సుల సంబంధించిన రాష్ట్ర వ్యాప్తంగా 12 లక్షల మంది విద్యార్థులకు గత నాలుగు సంవత్సరాలుగా ఫీజు బకాయిలు చెల్లింపులు నిలిచిపోవడంతో దిక్కుతోచని పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో కోర్సు ముగిసిన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్ల కోసం కళాశాలల చుట్టూ తిరుగుతూ మానసిక వేదనకు గురవుతున్నారని అన్నారు.

ముగిసిన అథ్లెటిక్స్ జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడాపాఠశాలలో మంగళవారం సబ్ జూనియర్ విభాగంలో అండర్–8, 10, 12 బాలబాలికల జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలను డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు 150మంది హాజరయ్యారు. ప్రతిభ కనబరిచినవారిని వచ్చేనెల సికింద్రాబాద్‌లో జరిగే రాష్ట్రపోటీలకు ఎంపిక చేసినట్లు సంఘం అధ్యక్ష కార్యదర్శులు మహిపాల్, రవి తెలిపారు. సంఘం కార్యవర్గ సభ్యుడు సతినేని రమేశ్, కోశాధికారి హరికిషన్, శిక్షకులు వరుణ్, కిరణ్ పాల్గొన్నారు.